క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మిర్యాలగూడ: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ స్టెఫీగ్రాఫ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 18 వరకు పట్టాదారు పాసుపుస్తకాలు పొంది, 18 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుతో ఆగస్టు 5 వరకు ఏఈఓల వద్ద లేదా మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గౌడ సంఘం నేతలు

గుర్రంపోడు: గౌడ కులస్తుల ఆరాధ్య దైవం సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు గుర్రంపోడు మండల కేంద్రంలో బుధవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు, ఎంపీటీసీ కుప్ప రాములుగౌడ్, మండల అధ్యక్షుడు ఐతగోని వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రావుల సైదులుగౌడ్, నాయకులు గాలి రమేష్‌గౌడ్, బల్గూరి నగేష్‌గౌడ్, బోయపల్లి సైదులుగౌడ్, రావుల శ్రీనివాస్‌గౌడ్, రావుల అంజనేయులుగౌడ్, ఎరుకల శంకర్‌గౌడ్, నర్సింహ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా మురళీయాదవ్



నియామకపత్రం అందుకుంటున్న మురళీయాదవ్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడిగా మండలంలోని రాయినిపాలెం గ్రామానికి చెందిన చిలకల మురళీయాదవ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మిర్యాలగూడలోని యాదవ సంఘం భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల యాదయ్యయాదవ్ చేతులమీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో ఎర్రయ్య, మురళీయాదవ్, అంజియాదవ్, నాగేశ్వర్‌రావు, జ్వాల వెంకటేశ్వర్లు, దూదిమెట్ల రాజశేఖర్ తదితరులున్నారు.

'బీసీ సింహగర్జన'ను విజయవంతం చేయాలి



సింహగర్జన సభ కరపత్రం ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

దేవరకొండ: నల్లగొండలో ఆగస్టు 6న నిర్వహించ తలపెట్టిన బీసీల సింహగర్జన సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో సింహగర్జన సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు ముఖ్యమంత్రి పదవిని ప్రకటించాలని, చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సింహగర్జన సభకు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిరందాసు రామదాసు, ప్రసన్నకుమార్, వల్లే కార్తిశ్రీనివాస్, బక్కతట్ల వెంకటేష్, ఎన్‌వీటీ, వనం చంద్రమౌళి, సత్యమూర్తి, నాగరాజు, శేఖర్, శ్రీరాం, లక్ష్మయ్య, చంద్రశేఖర్, మల్లేష్ తదితరులున్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశాలు

- హాజరుకాని అధికారులు, ప్రజాప్రతినిధులు
- మహిళా ప్రజాప్రతినిధులకు బదులు హాజరవుతున్న వారి కుటుంబ సభ్యులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల స్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి మూడునెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలు దారి తప్పుతున్నాయి. ప్రజాసమస్యలపై గొంతెత్తి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన ప్రజాప్రతినిధులు సమావేశాలకే హాజరుకావడం లేదు. ప్రజాప్రతినిధులకు తోడు కొన్ని శాఖల అధికారులు కూడా సమావేశాలకు డుమ్మా కొడుతుండటంతో ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా మారుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల ఉదాసీన వైఖరితో సమావేశాల లక్ష్యం నీరుగారిపోతుంది.

చర్యలు శూన్యం..

సమావేశాలకు హాజరుకాని అధికారులు, ప్రజాప్రతినిధులపై కఠినమైన చర్యలు తీసుకోకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. సర్వసభ్య సమావేశం నిర్వహణకు సరైన కోరం లేకపోవడంతో ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేసి పిలిపించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని అధికారులే చెబుతున్నారు. సమావేశాలకు రాని ప్రజాప్రతినిధులు, అధికారులపై చర్యలు తీసుకుంటే ఇలాంటి సమస్యలు తలెత్తవని పలువురు పేర్కొంటున్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో సరిపడా కోరం లేక నిరీక్షిస్తున్న అధికారులు

మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర ఏదీ..?

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో మహిళలకు యాభై శాతం రిజర్వేషన్ ప్రవేశపెట్టడంతో మండలంలోని 34 మంది సర్పంచుల్లో 17 మంది సర్పంచులు మహిళలే ఉన్నారు. 11 మంది ఎంపీటీసీల్లో ఆరుగురు మహిళా ప్రజాప్రతినిధులే ఉన్నారు. కానీ వీరి స్థానంలో సమావేశాలకు వారి భర్తలు, కుమారులు హాజరవుతున్నా అధికారులు పట్టించుకోకుండా చూసీచూడనట్లు వ్యవహిస్తున్నారు.

కిందిస్థాయి సిబ్బందే దిక్కు..

ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు సైతం సమావేశాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. పలు శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు తమ కిందిస్థాయి సిబ్బందిని సమావేశాలకు పంపించి చేతులు దులుపుకుంటున్నారు. ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలు, గత సమావేశాల్లో చర్చించిన అంశాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను తెలియజేసే నివేదికలను సైతం సమర్పించడం లేదు.

సమాచారం ఇస్తున్నాం



సర్వసభ్య సమావేశానికి సంబంధించిన సమాచారం ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేస్తున్నాం. ప్రజాప్రతినిధుల ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రాలను అందజేస్తున్నాం. నివేదికలతో హాజరుకావాలని అధికారులను కూడా ఒకరోజు ముందు ఆదేశిస్తున్నాం.

– ఖాజా అస్గర్ అలీ, ఎంపీడీఓ, తిరుమలగిరి

సరిపడా కోరం లేక గంటల తరబడి నిరీక్షణ

- అర్ధగంటలోనే ముగిసిన సర్వసభ్య సమావేశం

తిరుమలగిరి(సాగర్) మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వెలవెలబోయింది. ఎంపీపీ భగవాన్‌నాయక్ అధ్యక్షతన బుధవారం ఉదయం 10.30గంటలకు జరగాల్సిన తిరుమలగిరి మండల సర్వసభ్య సమావేశం సరిపడా కోరం లేకపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ప్రారంభమైంది. కోరానికి సరిపడా సభ్యులు లేకపోవడంతో అధికారులు వారికి ఫోన్లు చేసి బతిమిలాడి పిలిపించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒంటి గంట తరువాత ప్రారంభమైన సమావేశం ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చ జరపకుండానే అర్ధగంటలో ముగించి మమ అనిపించారు. కాగా గత ఇరవై రోజులుగా సమ్మె చేస్తున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని పంచాయతీ కార్మికులు సర్వసభ్య సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ భగవాన్ నాయక్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండటంతో గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అల్వాల సర్పంచ్ పాపిరెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వేదికలు, ఎంఈఓ కార్యాలయం పూర్తయినా ప్రారంభించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. తిరుమలగిరి చెవురు శిఖం భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఖాజా అస్గర్ అలీ, ఎంపీఓ పద్మ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధికి పెద్దపీట

దేవరకొండ: గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని తండాలు, గ్రామపంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుపాకుల సురేష్‌గౌడ్, ఎంపీడీఓ శర్మ, సర్పంచ్ శ్రీనునాయక్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, కిషన్‌బావోజీ, అంజయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మర్రిచెట్టుతండాలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు–ఆర్టీసీ కార్మికుల పరిస్థితి అనే అంశంపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 21రోజుల పాటు ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో ఆర్టీసీ గురించి కానీ కార్మికుల సంక్షేమం గురించి కానీ ఒక్క కార్యక్రమం చేపట్టలేదని అన్నారు. ఆర్టీసీని పరిరక్షించుకోవాలంటే అన్ని పార్టీలు, ప్రజలు కలిసికట్టుగా ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సిరాజ్‌ఖాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. అనంతరం టీడీపీ, సీపీఎం, బీఎస్పీ నాయకులు మాట్లాడారు. సమావేశంలో పల్లా దేవేందర్‌రెడ్డి, వస్కుల కృష్ణయ్య, ఎర్ర కృష్ణ, పల్లె నర్సింహ, నల్ల వెంకటయ్య, ఎండీ మైనొద్దీన్, తూం బుచ్చిరెడ్డి, నూనె రామస్వామి, ఆంజనేయులు, హరి, వెంకట్రాములు తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మిర్యాలగూడ టౌన్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆరో వార్డు ఇందిరమ్మ కాలనీలో బండి కన్వెన్షన్ హాల్ నుంచి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలతో పాటు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సాధినేని శ్రవంతీశ్రీనివాస్‌రావు, మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ శ్వేతారెడ్డి, స్థానికులు శ్రీనివాస్‌రావు, మురళీచారి, నాగరాజు, సుధాకర్, అజిత్‌సింగ్, నక్క శ్రీను, వెంకన్న, నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.



బండి కన్వెన్షన్ హాల్ వద్ద మొక్క నాటి నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్

బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



దేవరకొండ: కాంగ్రెస్‌లో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: మండలంలోని ముదిగొండ కొత్తతండాకు చెందిన పలు కుటుంబాలు బుధవారం దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బాలునాయక్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో సర్యానాయక్, జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, జగన్‌నాయక్, శంకర్‌నాయక్, సత్యం, కుమార్, వెంకటయ్య తదితరులున్నారు.

ఎన్ఎస్‌యూఐలో..

మిర్యాలగూడ: ఏబీవీపీ మిర్యాలగూడ పట్టణ కార్యదర్శి అవుట రోమన్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు ఏబీవీపీ కార్యకర్తలు, నియోజకవర్గ కమిటీ సభ్యులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐలో చేరారు. ఈ సందర్భంగా రోమన్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ ఎదిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలకు ఆకర్షితులై ఎన్ఎస్‌యూఐలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, నాయకులు చాంద్‌పాషా, ఇమ్రాన్, అజయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ: ఎన్ఎస్‌యూఐలో చేరిన ఏబీవీపీ నాయకులు

50శాతం రిజర్వేషన్ ఘనత ఛత్రపతి సాహూదే



ఛత్రపతి సాహూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

హాలియా: తన పరిపాలనలో బ్రాహ్మణేతర వర్గాలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ఛత్రపతి సాహూ మహారాజ్‌కే దక్కిందని బహుజన సమాజ్ పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమల్ల వెంకటేష్ అన్నారు. పేద వర్గాలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేసిన దినోత్సవం సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఛత్రపతి సాహూ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద వర్గాల కోసం ఎంతో కృషిచేసిన గొప్ప మహనీయుడు ఛత్రపతి సాహూ మహారాజ్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు తంగెళ్ల సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు బత్తుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటేశ్వర్లు, నియోజకవర్గ మహిళా కన్వీనర్ బైరాగి విజయ, పెద్దవూర మండల అధ్యక్షుడు కుక్కమూడి ముత్యాలు, నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె



పెద్దవూర: వర్షంలోనూ సమ్మెలో పాల్గొన్న గ్రామపంచాయతీ కార్మికులు

అడవిదేవులపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గత 21 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కుర్ర సక్రు, ఉపాధ్యక్షురాలు సుశీల, ప్రధాన కార్యదర్శి ధనావత్ కస్వర్‌లాల్, కోశాధికారి బంగారమ్మ, కార్యదర్శి దేశోజు యల్లాచారి, సహాయ కార్యదర్శి సైదులు తదితరులున్నారు.

ఎంపీపీకి వినతి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పంచాయతీ కార్మికులు బుధవారం మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ భగవాన్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం రూ.19,500 కనీస వేతనం ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని. ప్రమాదం జరిగితే కుటుంబానికి రూ.10లక్షలు ప్రమాద బీమా కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పంచాయతీ కార్మికుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి అలీ పాషా, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, సంఘం నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రావులపాటి సైదులు తదితరులు ఉన్నారు.

వర్షంలోనూ సమ్మెలో..

పెద్దవూర: వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంగారెడ్డి, ఊరె ప్రభాకర్, వేణు, కృష్ణ, చెన్నారెడ్డి, లాలు, ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సర్వీస్ రోడ్డు

- మోకాళ్లోతు గుంతల్లో వర్షపు నీరు



గుంతలమయంగా మారిన మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని ఫ్లైఓవర్ పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి పూర్తి చేసే సమయంలోనే సర్వీస్ రోడ్డు పూర్తిచేయాల్సి ఉన్నా.. అసంపూర్తిగా వదిలేశారు. దీంతో మోకాళ్లోతు గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల నిండా వర్షపు నీరు చేరి వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వాహనాలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఓ లారీ ఆ గుంతల్లో పడిపోవడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని.. ఇప్పటికైనా స్పందించి ఫ్లైఓవర్ పక్కన సర్వీస్ రోడ్డు బాగుచేయాలని కోరుతున్నారు.



గుంతల్లో బోల్తా పడిన లారీ

కేంద్రమే బాధ్యత వహించాలి

దేవరకొండ: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఎస్పీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు రమావత్ రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత నాలుగు నెలలుగా మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హింసాత్మక ఘటనలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డా. ఏకుల రాజారావు, మహిళా కన్వీనర్ లలిత, ప్రకాష్, ఎర్ర యాదయ్య, బాలునాయక్, మొగులయ్య, యాదగిరి, ఇమ్రాన్, బాలకృష్ణ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎర్ర కృష్ణ

గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- 21 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు
- ఇబ్బందుల్లో ప్రజలు
- అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం

పెద్దవూర: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు గత 21 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తుండడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడం, పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేక అంటువ్యాధుల ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు.

పని బారెడు.. జీతం మూరెడు..

ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.8500 వేతనం చెల్లిస్తుంది. అదీ గ్రామపంచాయతీల నుంచి వచ్చే నిధుల లభ్యతను బట్టి వేతనాలను చెల్లిస్తున్నారు. దీంతో వేతనాల చెల్లింపుల్లో వెనకా ముందు అవుతోంది. అందరినీ మల్టీపర్పస్ కార్మికులుగా గుర్తించారు. పంచాయతీ కార్మికులు ప్రస్తుతం ట్రాక్టర్ డ్రైవర్, వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్లు గానూ పనిచేస్తున్నారు. మురుగు కాల్వల్లో పూడికతీత, వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, ఫాగింగ్ చేస్తున్నారు. ట్రాక్టర్ ద్వారా ఇంటింటికి తిరుగుతూ చెత్తాచెదారాన్ని సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. గత ఇరవై రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండటంతో గ్రామాల్లో వ్యర్థాలను సేకరించే వారే కరువయ్యారు. పెద్దవూర మండల కేంద్రంలో ఆయా దుకాణాల్లోని వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని వ్యాపారులు బస్తాలలో తెచ్చి జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై నిర్మించిన డివైడర్ల మధ్యలో వేస్తున్నారు. దీంతో వర్షానికి వ్యర్థాల బస్తాలు తడిసి వాటి నుంచి దుర్వాసన వస్తోంది. ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను సైతం వీధుల్లో వేస్తున్నారు. దీంతో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. డ్రెయినేజీ పూడిక తీయకపోవడంతో ఇళ్ల పరిసరాలు, వీధుల్లో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా ప్రజలు డెంగీ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. కార్మికుల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్దవూర మండల కేంద్రంలో కోదాడ- జడ్చర్ల హైవే డివైడర్ మధ్యలో వేసిన వ్యర్థాలు

పంచాయతీ కార్మికుల డిమాండ్లు..

జీఓ నంబర్ 51ని సవరించాలి. గ్రామపంచాయతీ నుంచి కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలి. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి. కార్మికులు, ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. కనీస వేతనం రూ.19వేలు, ఆరోగ్య, ప్రమాద బీమా రూ.10లక్షలు అమలు చేయాలి. ఏటా అందించే యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలకు బదులుగా డబ్బులు అలవెన్సు రూపంలో అందజేయాలి. విధి నిర్వహణలో మృతిచెందితే రూ.10లక్షల పరిహారం అందించాలి. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సౌకర్యాలను కల్పించాలి. ట్రాక్టర్ డ్రైవర్లకు లైసెన్సుల జారీతో పాటు ప్రమాదంలో మృతిచెందితే అంత్యక్రియలకు తక్షణ సాయం కింద రూ.30వేలు ఇవ్వాలి. ఉన్నతాధికారుల వేధింపులను అరికట్టాలి.

డిమాండ్లు పరిష్కరించాలి



మా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మెను విరమించేది లేదు. గ్రామాలలో టైంతో సంబంధం లేకుండా పారిశుద్ధ్య పనులు చేస్తున్నాం. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనం సరిపోవడం లేదు. అదీ సమయానికి రాదు. పనిభారం పెరుగుతుంది. పెరిగిన నిత్యావసర ధరలకు జీతం డబ్బులు సరిపోక అప్పులు చేయాల్సి వస్తుంది. చాలీచాలని వేతనంతో కుటుంబాన్ని పోషించలేక అర్ధాకలితో అలమటిస్తున్నాం.

– ఊరె ప్రభాకర్, కార్మికుడు, పెద్దవూర

దుర్వాసన వస్తోంది



పంచాయతీ కార్మికుల సమ్మెతో పారిశుద్ధ్య నిర్వహణ ఇబ్బందిగా మారింది. మురుగు కాలువలలో సిల్ట్ పెరిగి, వీధులలో నుంచి మురుగు పారుతూ దుర్వాసన వెదజల్లుతుంది. చెత్తసేకరణ ట్రాక్టర్ ఇళ్లకు వెళ్లకపోవడంతో ప్రజలు వ్యర్థాలను వీధులు, రోడ్ల వెంట వేస్తున్నారు. దీంతో ఇబ్బందిగా ఉంది. ప్రైవేటు వర్కర్లతో పనులు చేయించాలంటే కూలీ అధికంగా అడుగుతున్నారు. జీపీ నిధులు లేక ఇబ్బంది పడుతున్నాం.

– ధాకునాయక్, కార్యదర్శి, పెద్దవూర

మిర్యాలగూడకు చేరుకున్న సైకిల్‌యాత్ర

మిర్యాలగూడ అర్బన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం మిర్యాలగూడకు చేరుకుంది. ఈ సైకిల్‌యాత్రకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హాస్టళ్లలో ఉండి చదువుకునే విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలో మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్, నాయకులు కుర్ర సైదానాయక్, సీఐటీయూ నాయకులు గౌతంరెడ్డి, మంగారెడ్డి, బావండ్ల పాండు, పతాని శ్రీను, లక్ష్మణ్, జగన్, రమేష్, వీరన్న తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

వేములపల్లి: రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర బుధవారం వేములపల్లి మండల కేంద్రానికి చేరుకోగా.. వామపక్ష నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ గోవర్ధని మాట్లాడుతూ.. మండలంలో కస్తూర్బా గాంధీ పాఠశాలకు సొంత భవనం లేక పక్క మండలానికి తరలించారని.. దీంతో వందలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండలానికి ఎంఈఓ లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చల్లబొట్ల చైతన్య, సీఐటీయూ జిల్లా నాయకుడు రొండి శ్రీనివాస్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పతాని శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, సైదానాయక్, లక్ష్మణ్‌నాయక్, వెంకటేష్, రమేష్, జగన్, వీరన్న, సంపత్, సాయిచంద్, నవదీప్ పాల్గొన్నారు.



వేములపల్లిలో సైకిల్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు